సాక్షి
నల్లగొండ

ఆదివారం । 24 । మార్చి । 2024



సామాజిక న్యాయ యాత్ర

బీసీల డిమాండ్ల సాధనకు బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక న్యాయయాత్ర నల్లగొండకు చేరింది. - 10లో



పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంటమాలజీ హైదరాబాద్ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు. - 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (ఆదివారం సా॥)

సహర్ 4-54 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

రన్ ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్ : రన్ ఫర్ జీసస్ పోస్టర్, టీషర్ట్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీస్తు సిలువపై మరణించి తిరిగి మూడో రోజున పునరుత్థానం కావడం గొప్ప విశేషమన్నారు. ఏసుక్రీస్తు పేదలు, దిక్కులేని వారు, అభాగ్యులను ఆదరించి సహాయం చేయాలని చెప్పారని.. ఆయన మార్గంలో ప్రజలంతా పయనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎంసిఏ జిల్లా అధ్యక్షుడు టీఎస్ విలియమ్స్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రేఖల భద్రాద్రి, పసల శౌరయ్య, డాక్టర్ కట్ట మోజెస్, జాషువా నాడర్, డాక్టర్ అమృతయ్య, సంపూర్ణ దేవి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

మిర్యాలగూడ : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్ శనివారం పరిశీలించారు. ప్రశ్నపత్రాల కౌంటింగ్, పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా ఉండి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

ప్రశాంతంగా మ్యాథ్స్ పరీక్ష

నల్లగొండ : పదో తరగతి మ్యాథ్స్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని డీఈఓ భిక్షపతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 109 కేంద్రాల్లో 19,455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న సక్కుబాయి

నల్లగొండ టౌన్ : చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ జిల్లా అధికారిణి సక్కుబాయి పేర్కొన్నారు. శనివారం స్థానిక మాన్యం చెల్క అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్షోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. చిరుధాన్యాలు, మిల్లెట్స్, పోషకాహారం, ఆరోగ్యంపై చిన్నారులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సిబ్బంది అరుణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫిరోజ్‌ఫాతిమా పాల్గొన్నారు.

'శివన్నగూడెం' పనుల అడ్డగింత



వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

మర్రిగూడ : శివన్నగూడెం రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయిన తమకు ప్రభుత్వం తక్షణమే ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అందించడంతోపాటు పునరావాసం కల్పించాలని కోరుతూ శనివారం నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు రిజర్వాయర్ వాహనాలను నిలిపివేసి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు న్యాయపరమైన పరిహారం చెల్లించకపోగా పునరావాసానికి కూడా కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సదస్సు

నల్లగొండ : ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమం–నేటి సవాళ్లు అనే అంశంపై నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ఎంఎల్‌సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఒకటి ఓసీకి.. మరొకటి బీసీకి

బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు

నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరికి క్యామ మల్లేష్

- రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్
- సరైన అభ్యర్థుల కోసం సుదీర్ఘ చర్చలు, సమాలోచనలు
- కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర
- సామాజికవర్గాల వారీగా ఎంపిక
- భువనగిరి టికెట్ మూడోసారి కూడా బీసీలకే..



పేరు: కంచర్ల కృష్ణారెడ్డి
తండ్రి: కంచర్ల మల్లారెడ్డి
భార్య: సులోచన
కుమారుడు: సమరసింహారెడ్డి
పుట్టిన తేదీ: 10.5.1970
గ్రామం: ఉరుమడ్ల, చిట్యాల మండలం
విద్యార్హత: ఎంఏ, ఎల్ఎల్‌బీ
వృత్తి: అడ్వకేట్ (1995– 2006)
రాజకీయం : బీఆర్ఎస్ పార్టీలో చేరిక అనంతరం హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు



పేరు : క్యామ మల్లేష్
పుట్టిన తేదీ : 05.01.1965
చదువు : గ్రాడ్యుయేషన్
కుటుంబం : భార్య జంగమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు
స్వగ్రామం : శేరిగూడ, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా
రాజకీయం : 1992 నుంచి 1994 వరకు ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 2013 నుంచి 2018 వరకు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, 2019 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డిని, భువనగిరికి క్యామ మల్లేష్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు గుత్తా అమిత్‌రెడ్డి ముందు ఉత్సాహం చూపినా.. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆయన పోటీ చేయనని అధిష్టానానికి తెలియజేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డిని బరిలో నిలపాలని పార్టీ భావించినా ఆయన బీజేపీకి టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరగడంతో కంచర్ల కృష్ణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. అయితే తాను బీజేపీలోకి వెళ్లడం లేదని, బీఆర్ఎస్‌లోనే ఉంటానని, ఎంపీగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చిన్నపరెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. కానీ, శనివారం నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి విషయమై నేతలతో చర్చించి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డిని అభ్యర్థిగా బీఆర్ఎస్ అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించే వరకు ఆగితే ప్రచారానికి ఇబ్బంది అవుతుందని, క్షేత్ర స్థాయిలో ప్రచారం ముమ్మరంగా చేయాలంటే వెంటనే అభ్యర్థులను ప్రకటించాలని జిల్లా నేతలు పట్టుబట్టారు. దీంతో శనివారం అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది.

భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేష్

నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని ఓసీకి ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. భువనగిరి స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి(కురుమ) చెందిన క్యామ మల్లేష్‌కు కేటాయించింది. భువనగిరి టికెట్ విషయంలో కూడా పార్టీ తర్జనభర్జన పడింది. క్యామ మల్లేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను పరిశీలించింది. పైళ్ల శేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. అయితే, బీసీ వర్గానికి ఇవ్వాలని భావించిన పార్టీ.. క్యామ మల్లేష్, బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను పరిశీలించింది. చివరకు క్యామ మల్లేష్ పేరును ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలకు గాను రెండు చోట్ల అభ్యర్థులను ప్రకటించడంతో ఇన్నాళ్లుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

మొదటి నుంచి బీసీలకే..

తెలంగాణ ఆవిర్భవించిన తరువాత జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ టికెట్‌ను బీసీలకే కేటాయిస్తోంది. ఈ నియోజకవర్గం నుంచి 2014, 2019లో ఎంపీ టికెట్ బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ ఇచ్చారు. 2014లో గెలిచిన ఆయన 2019లో ఓడిపోయారు. ఈ సారి కూడా బీసీ సామాజికవర్గానికి చెందిన క్యామ మల్లేష్‌కు ఇచ్చింది. క్యామ మల్లేష్ 2014లో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం టికెట్ ఇవ్వకపోవడంతో 2019లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

భిక్షమయ్యగౌడ్, బాలకృష్ణారెడ్డికి నిరాశ

భువనగిరి ఎంపీ టికెట్ దాదాపు ఖరారు అయినట్లు భావించిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌కు అధిష్టానం మొండిచేయి చూపింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బూర నర్సయ్యగౌడ్ బీఆర్ఎస్‌ను వీడడంతో బీజేపీలో ఉన్న భిక్షమయ్యగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ ఆహ్వానించింది. ఆ సందర్భంగా అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు భిక్షమయ్యగౌడ్‌కు పదవుల హామీ ఇచ్చారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డికి కూడా నిరాశే ఎదురైంది. భువనగిరి ఎంపీ టికెట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు బాలకృష్ణారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్న సమయంలో ఎంపీ టికెట్ ఇస్తామని అధినేత కేసీఆర్ హామీ ఇచ్చారని ఇటీవల జిట్టా ప్రకటించారు. కానీ, ఆయనకు టికెట్ దక్కలేదు.

సెస్ వసూలు సరే.. సౌకర్యాలేవీ?

- ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- ప్రయాణికులకు కరువైన భద్రత
- ప్రమాదాల సమయంలో తప్పని ఇబ్బందులు
- బస్టాండ్లలోనూ కల్పించని తాగునీటి వసతి



ఆదాయ ఇలా.. (రోజుకు రూ.)	మహాలక్ష్మి పథకానికి ముందు	పథకం అమలయ్యాక
సెస్ వసూలు	5,50,335	9,23,505
ఆదాయం	1,10,37000	1,45,69,000



మిర్యాలగూడ ఆర్టీసీ బస్సులో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి భద్రతతోపాటు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బస్టాండ్లలో తాగునీరు, బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు కనిపించని పరిస్థితి నెలకొంది. బస్సు సర్వీసుల్లో ప్రయాణించే వారి టికెట్‌పై పల్లె వెలుగు బస్సుల్లో రూ.2, ఇతర బస్సుల్లో రూ.6 చొప్పున సెస్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఇలా సంవత్సరానికి కోట్లాది రూపాయలు సమకూరుతున్నప్పటికీ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు, భద్రత కల్పించడం లేదు.

వైద్య కిట్లు నిల్

ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం అమలు తరువాత బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రయాణికులకు పెద్దపీట వేస్తామని చెబుతున్న ఆర్టీసీ.. ఏదైనా ప్రమాదం జరిగి ప్రయాణికులు గాయపడినప్పుడు ప్రథమ చికిత్స అందించేందుకు కనీసం వైద్య కిట్లు అందుబాటులో ఉంచడం లేదు. పలు బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారాలు, ప్రథమ చికిత్సకు సంబంధించిన మందులు లేనేలేవు. దీనికి తోడు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నా.. రవాణా శాఖ మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

ఆదాయం పెరుగుతున్నా..

నల్లగొండ రీజియన్ పరిధిలోని యాదగిరిగుట్ట, కోదాడ, సూర్యాపేట, నార్కట్‌పల్లి, దేవరకొండ, నల్లగొండ, మిర్యాలగూడ డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో 620 ఆర్టీసీ బస్సులు వివిధ ప్రాంతాలకు రోజుకు 2,43,698 కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుండగా వీటిద్వారా రోజు రూ.1,10,37,000 వరకు ఆదాయం సమకూరుతుంది. మహాలక్ష్మి పథకం కంటే ముందు 1,60,163 మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. మహాలక్ష్మి పథకం అమలయ్యాక ఆ సంఖ్య 2,75,085 మందికి పెరిగింది. దీంతో సెస్ రూపంలో రోజుకు రూ.9,23,505 వసూలవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ ఆర్టీసీ ప్రయాణికులకు మాత్రం సౌకర్యాలు సమకూర్చడం లేదు.

ఇబ్బందులు కలగకుండా చూస్తాం



ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి వచ్చే సెస్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్యాన్లు, చైర్లు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నాం. వేసవిలో తాగునీటి వసతి కల్పించేందుకు దివీస్ పరిశ్రమ సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 108 వాహనం వస్తుంది. కొన్ని బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతున్నా అపహరణకు గురవుతున్నాయి. – శ్రీదేవి, ఆర్ఎం నల్లగొండ

ప్రయాణికులకు భరోసా కల్పించాలి



సన్మానం పొందిన ఉద్యోగులతో ఈడీ పురుషోత్తంనాయక్, ఆర్ఎం శ్రీదేవి

నల్లగొండ రూరల్ : ప్రయాణికులకు భరోసా, భద్రత కల్పించేలా ఆర్టీసీ ఉద్యోగులంతా సమష్టి కృషి చేయాలని హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ అన్నారు. శనివారం నల్లగొండ ఆర్టీసీ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతి చక్రం, త్రైమాసిక పురస్కారాలు, నగదు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లా అంటేనే విజయాల ఖిల్లాగా పేరు గాంచిందని నల్లగొండ రీజియన్ ఉద్యోగులంతా ఆర్టీసీ విజయాల కోసం కృషి చేశారని ప్రశంసించారు. వచ్చే మూడు నెలలు విద్యా సంస్థలకు సెలవులు, పెళ్లిల్లు ఉన్నందున ఎక్కువ మంది ప్రయాణిస్తారని వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎంలు మాధవి, శివశంకర్, డీఎంలు పాల్, రామ్మోహన్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్, రాజీవ్ ప్రేమ్‌కుమార్, శ్రీహర్ష, వెంకటమ్మ, రాజు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సహజ ఇంధన వనరులపై దృష్టి సారించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : మారుతున్న అవసరాల నేపథ్యంలో సహజ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 28న ఎంజీయూలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇందన పదార్థాల అభివృద్ధి, తీరు తెన్నులపై నిర్వహించే సెమినార్ కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంప్రదాయక వనరులు నానాటికి కనుమరుగవుతూ భావితరాలకు ఇంధనం పెను సవాలుగా మారనుందన్నారు. రాబోయే రోజుల్లో సిలికాన్, జీవ ఇంధనాలు, వ్యర్థాల నుంచి ఇంధనం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, కొప్పుల అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, సత్తిరెడ్డి, భిక్షమయ్య, రమేష్, మద్దిలేటి, మాదూరి, రూప, శాంతకుమారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ : ప్రజలకు ఓటు వజ్రాయుధంగా పనిచేస్తుందని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'సిస్టమేటిక్ ఓటర్ల ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్' (స్వీప్) కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన ఉంటే మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, ఎన్నికల అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

రామగిరి(నల్లగొండ) : టీబీ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా శనివారం ఎన్జీ కళాశాలలో మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టీబీ రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్, మైక్రో బయాలజీ ఇన్‌చార్జి బి.నాగరాజు, జి.అంజయ్య, ఎస్.శ్రీనాథ్‌పటేల్, డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, కె.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



కొత్తవంతెన వద్ద బౌద్ధులు



మహాస్థూపంలోని అష్ట బుద్ధుల వద్ద విద్యార్థులు

నాగార్జునసాగర్ : సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. వందల సంఖ్యలో బౌద్ధులు బుద్ధవనం, నాగార్జునకొండ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. శనివారం ఆంధ్రా ప్రాంతంలోని నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి బౌద్ధ విద్యార్థులు సాగర్‌కు వచ్చారు. బుద్ధవనాన్ని సందర్శించి లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. ఇతర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాగర్ సందర్శనకు పెద్దసంఖ్యలో వచ్చారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

- మహిళా సంఘాలకు స్కూళ్ల నిర్వహణ బాధ్యత
- చైర్మన్‌గా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, కన్వీనర్‌గా హెడ్‌మాస్టర్
- ఇప్పటికే 50 శాతానికిపైగా పూర్తయిన కమిటీల నియామకం



నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పాఠశాల యాజమాన్య కమిటీలు ఉండేవి. వాటి స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీల పేర స్కూల్‌లో కమిటీలను నియమించాలని నిర్ణయించింది. వీటికి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చైర్మన్‌గా ఉండనున్నారు. ఇప్పటికే పలు కమిటీల నియామకం పూర్తయింది. ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ల జాయింట్ ఖాతాను తెరిచి విద్యాశాఖకు సమర్పించాలని సూచించింది.

జిల్లాలో 1,483 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో 1,483 ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో గతంలో పాఠశాల యాజమాన్య కమిటీలు ఉండేవి. విద్యార్థుల తల్లిదండ్రులనే విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నుకుని హెడ్మాస్టర్ జాయింట్ చెక్ పవర్‌తో పది మంది సభ్యులతో కమిటీ ఉండేది. ప్రభుత్వం వాటిని రద్దు చేస్తూ వాటి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఏ గ్రామంలో అయితే గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఉంటుందో వారే గ్రామంలో ఉన్న పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కన్వీనర్‌గా పాఠశాల హెడ్మాస్టర్ వ్యవహరిస్తారు. కాగా.. ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. అందులో ఒకరు ఎస్సీ, ఒకరు ఎస్టీ తప్పనిసరిగా ఉండాలి. ముగ్గురిలో మహిళా సంఘాల్లో సభ్యులైన కుటుంబానికి చెందిన వారై ఉండాలి.

50 శాతానికిపైగా పూర్తయిన కమిటీలు..

ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీల నియామకాలు జరుగుతున్నాయి. మొదట ఈనెల 15లోగా పూర్తి చేయాలని భావించారు. ఇప్పటివరకు 50 శాతం మేర కమిటీలు పూర్తయ్యాయి. అయితే ఈ నెల చివరిలోగా కమిటీలన్నింటినీ నియమించి చైర్మన్, కన్వీనర్లుగా హెడ్‌మాస్టర్ల ఇరువురి జాయింట్ అకౌంట్‌ను నేషనల్ బ్యాంకులో అకౌంట్ తెరిచి జిల్లా విద్యా శాఖకు అందించాలని సూచించారు.

నెలాఖరులోగా కమిటీల నియామకం



పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే జిల్లాలో ఉన్న 1483 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేస్తాం. ఈ నెల చివరిలోగా కమిటీల నియామకం పూర్తి చేసి, చైర్మన్, కన్వీనర్ల జాయింట్ బ్యాంకు ఖాతాను తెరిచి పంపించాల్సి ఉంది. ప్రభుత్వం ఈసారి పాఠశాలల నిర్వహణ బాధ్యత మహిళలకే అప్పగించడం శుభ పరిణామం.

– బొల్లారం భిక్షపతి, డీఈఓ

కమిటీల నిర్వహణ

అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాఠశాలలకు హాజరవుతున్నారా లేదా ఇతర కార్యక్రమాలు సమీక్షించాలి. కమిటీ గడువు 2 సంవత్సరాలు ఉంటుంది. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మరమ్మతులు, విద్యుత్, తదితర వసతులతోపాటు శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులను పర్యవేక్షించి పనులు చేయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్ఆర్ఎస్‌ఈజీఎస్ కింద పట్టణ ప్రాంతాల్లో విద్యామౌలిక సదుపాయాల సంస్థ ద్వారా నిధులు కేటాయిస్తారు. వీటి ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే జూన్ 10లోగా పాఠశాలలను ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రతివారం విద్యాశాఖ కమిషనర్ సమీక్షించి పాఠశాలల తీరుపై నివేదిక అందిస్తారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి

పెద్దవూర: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన నూకం అఖిల్ (17), పల్లవల కార్తీక్(17)లు బాల్య స్నేహితులు. వీరిద్దరు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశారు. వీరు శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై పెద్దవూరకు బయలుదేరారు. పెద్దవూర నుంచి నాయినివానికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ నాగార్జునసాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారిపై నుంచి మండల కేంద్రం సమీపంలోని నాయినివానికుంట స్టేజీ వైపు డ్రైవర్ పోనిచ్చాడు. ఈ ప్రదేశంలో మూలమలుపు ఉండటం, అదే సమయంలో వీరి బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు, ఛాతికి తీవ్ర గాయాలై నూకం అఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా, కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108 వాహనంలో కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. కార్తీక్ మృతదేహానికి సాగర్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

బస్సు లారీ ఢీ

- పలువురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాయినిగూడెం వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ రాయినిగూడెం వద్ద యూ టర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న రాజధాని బస్సు వెనుక నుంచి లారీని ఢీకొట్టింది. డ్రైవర్‌తో సహా 11మంది ప్రయాణికులు బస్సులో ఉండగా ఖమ్మం పట్టణానికి చెందిన శంకర్, మున్నిసా, భరత్, చైతన్య, అభినందన్, డ్రైవర్ అప్పారావుతో పాటు మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటన స్థలాన్ని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలునాయక్‌లు పరిశీలించారు.

కర్రతో కొట్టి.. బండరాయితో మోది

అల్లుడిని హత్య చేసిన మామ

- బండరాళ్లు కొట్టే ప్రాంతంలో కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప ఘర్షణ
- పంచాయితీలో మాట్లాడుతుండగా క్షణికావేశంలో ఘాతుకం
- చింతపల్లి వెంకటంపేటలో దారుణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న దేవరకొండ డీఎస్పీ గిరిబాబు

చింతపల్లి : చింతపల్లి మండలం వెంకటంపేటలో దారుణం చోటు చేసుకుంది. క్షణికావేశంలో ఓ వ్యక్తి తన అల్లుడి తలపై కర్రతో కొట్టి ఆపై బండరాయితో మోది హత్య చేశాడు. ఈ ఘటనపై నాంపల్లి సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని వెంకటంపేట గ్రామానికి చెందిన సంపంగి ఎల్లయ్య, అతని కొడుకు సంపంగి కోటేష్, అల్లుడు ఆలకుంట్ల రాజు(38) బండరాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలోనే రోజూ మాదిరిగా రాళ్లు కొట్టేందుకు శుక్రవారం గ్రామ శివారులోని షేర్‌బండపైకి వెళ్లారు. బండ కొట్టుకునే విషయంలో ముగ్గురి మధ్య తగాదా చోటుచేసుకుంది.

పెద్ద మనుషుల్లో మాట్లాడుతుండగా..

ముగ్గురు సాయంత్రం గ్రామానికి చేరుకుని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. రాత్రి బండ కొట్టుకునే విషయంలో జరిగిన తగాదాపై పెద్ద మనుషుల మాట్లాడుకోవాలని నిర్ణయించుకన్నారు. ఈ క్రమంలో గ్రామంలోని కొత్తగా నిర్మించిన పశువుల ఆస్పత్రి వద్ద ఇరు కటుంబాల వారు చేరుకుని మాట్లాడుకుంటున్నారు. ఈ తరుణంలో రాజు, కోటేష్ మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. దీంతో రాజు తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో కోటేష్‌పై దాడి చేశాడు. ఆ పక్కనే ఉన్న ఎల్లయ్య తీవ్ర ఆగ్రహానికి లోనై తన చేతిలో ఉన్న కర్రతో అల్లుడు రాజు తలపై బలంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో రాజు కిందపడిపోగా ఆ వెంటనే ఎల్లయ్య పక్కనే ఉన్న బండరాయిని అతడి తలపై ఎత్తేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు దారి తీసిన కారణాలను గ్రామస్తులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సేకరించారు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పోస్టుమర్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బ్లేడ్ దాడిలో గాయపడిన కోటేష్ దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రధాన నిందితుడు ఎల్లయ్య పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

3,500 కిలోల నల్లబెల్లం పట్టివేత

శాలిగౌరారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ట్రక్కులో అక్రమంగా తరలిస్తున్న 3500 కిలోల నల్లబెల్లం(70 బస్తాలు) పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం రాత్రి వెల్లడించారు. శాలిగౌరారం మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై సాయంత్రం పోలీసులు వాహనాల తనఖీ చేపట్టారు. ఈ క్రమంలో చిత్తూరు పట్టణానికి చెందిన భరత్‌నాయుడు, ఉదయ్‌కుమార్‌లు నల్లబెల్లం రవాణా చేస్తున్న వాహనం పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. బెల్లం రవాణాకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పట్టుకొని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి శాలిగౌరారం మండలం చిత్తలూరుగ్రామంలో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో బెల్టు దుకాణం నడుపుతున్న ఎర్ర విజయ్‌కుమార్ ఇంట్లో సోదాలు చేయగా 12 బీర్లు లభ్యమయ్యాయని ఎస్‌ఐ తెలిపారు.అనుమతులు లేకుండా బెల్టు దుకాణం నడుపుతున్న విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వరికొయ్యలకు నిప్పు.. తప్పిన ప్రమాదం

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో ఆ పక్కనే ఉన్న జమాయిల్ తోటకు మంటలు వ్యాపించాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెంలో శనివారం జరిగింది. రామలింగాలగూడెం శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న కోసిన వరి పొలాల్లోని గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అక్కడ నుంచి మొదలైన మంటలు వరిగడ్డితో పాటు పక్కనే ఉన్న జమాయిల్ తోట అందులో ఉన్న ఇంటి వైపు వ్యాపించాయి. గమనించిన అన్నెపూరి సత్యనారాయణ ఫైర్ స్టేషన్‌కు సమాచాచం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఎ.సత్యనారాయణరెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్ టి.నరహరి, సిబ్బంది టి.మధు, డి.శంకర్, ఏ.సదానందం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి కిందపడి కాంగ్రెస్ నాయకుడు మృతి



రామిరెడ్డి(ఫైల్)

మునగాల(కోదాడ): ట్రాక్టర్ పైనుంచి కిందపడి కాంగ్రెస్ నాయకుడు మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం నారాయణగూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలంలోని నారాయణగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లె రామిరెడ్డి(75) శనివారం గ్రామంలో చేపట్టిన సీసీరోడ్డు పనులను పరిశీలించడానికి ట్రాక్టర్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా బీపీ డౌన్ కావడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతడి తల ట్రాక్టర్ టైర్ కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రామిరెడ్డి ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామిరెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు గ్రామశాఖ నాయకుడు సారెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. దహనసంస్కారాలకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకానున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

రామాలయంలో చోరీ

చండూరు : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. చండూరు మండలం ఉడతలపల్లిలోని రామాలయంలోకి శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించారు. ఆలయంలోని శతగోపురం, మూడు జతల పుస్తెలతాడు అపహరించుకుపోయారు. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఓంకారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మద్దిరాల : అక్రమంగా నిల్వ ఉంచిన రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల గ్రామానికి చెందిన ఆమంచి మహేష్ తన ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడి చేశారు. అతడి ఇంట్లో నిల్వ ఉన్న రెండు క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుదేస్‌ఐ మధునాయుడు తెలిపారు.

హోంగార్డు ఇంట్లో చోరీ

- 4.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్ శనివారం రాత్రి వెలుగుచూసింది. వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకీడు పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని తీసుకుని ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్స అనంతరం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులకొట్టి ఉంది. చోరీ జరిగిందని గ్రహించి లోపలికి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనలో 4.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

- వాహనాల తనిఖీలో పట్టుకున్న బీబీనగర్ పోలీసులు
- నలుగురిపై కేసు.. వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

బీబీనగర్: హైదరాబాద్ నుంచి వరంగల్‌కు తరలిస్తున్న పేలుడు పదార్థాలను శనివారం బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజేష్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూలు జిల్లా మొలుగార గ్రామానికి చెందిన శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాని బయ్యపు హనుమంతు రెడ్డి తన వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పేదవీడు నర్సింహులును కొండాపూర్‌లోని శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ వద్ద లోడ్ ఉందని చెప్పి వాహనాన్ని పంపించాడు. అక్కడ శ్రీనివాస్ ఎంటర్ ప్రైజెస్ యాజమాని దేవేందర్ రెడ్డి చెప్పినట్లుగా మేనేజర్ దత్తురావు డ్రైవర్ నర్సింహులు ఆ వాహనంలో 6,925 కేజీల ఎక్స్‌ప్లోజీవ్ పదార్థాలను లోడ్ చేయించాడు. అనంతరం దత్తు ఇద్దరు యాజమానులు లోడ్ విషయంలో ఒకరికొకరు మాట్లాడుకున్నారని, దానికి సంబంధించిన వేబిల్లు ఇస్తున్నానని, ఈబిల్లు ఎక్కడా చూపించ వద్దని చెపప్పాడు. నీకు మరో వేబిల్లును సాల్వో ఎక్స్‌ప్లోజీవ్‌కు చెందిన అకౌంటెంట్ పరుశురాం పంపుతాడని, ఎవరైనా వాహనాన్ని ఆపితే అదే చూపించాలని నర్సింహులుకు చెప్పాడు. పరుశురాంలు తప్పుడు డ్యాకుమెంట్ సృష్టించి డ్రైవర్‌కు వేబిల్లును పంపించాడు. ఆవేబిల్లుపైనే ఉన్న స్థలానికి ఎక్స్‌ప్లోజీవ్ పదార్థాలు చేరవేయాలని చెప్పాడు. ఘట్‌కేసర్ నుంచి నల్లగొండకి ఎక్స్‌ప్లోజీవ్‌లను తీసుకెళ్లనట్లుగా రికార్డులు చూపించి నాగర్‌కర్నూల్‌లోని శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమేశ్వర స్టోన్ క్రషర్‌కు రవణా చేస్తున్నట్లు మరొక తప్పుడు డ్యాక్యుమెంట్ సృష్టించి అక్రమ పేళుళ్లకు పాల్పడుతున్నారని డీసీపీ తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, జనగామ జిల్లాలోని సోమేశ్వర క్వారీతో సంబంధాలు ఉన్నాయని వీటి అన్నింటిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. అక్రమ పేలుడు పదార్థాల రవాణాకు కారకులైన నాగర్‌కర్నూలు జిల్లా మొలుగారం గ్రామానికి చెందిన శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాని బయ్యపు హనుమంతరెడ్డి, ఘట్‌కేసర్ మండలం కొండాపురానికి చెందిన శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ యాజమాని దేవేందర్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌కు చెందిన ఎక్స్‌ప్లోజీవ్ డీసీఎం వాహన డ్రైవర్ పెదవీడు నర్సింహులు, ఘట్‌కేసర్ మండలం అక్కిరెడ్డిపల్లికి చెందిన సాల్వో ఎక్స్‌ప్లోజీవ్ కంపెనీకి చెందిన అకౌంటెంట్ లింగాల పరుషరాములుపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు.

యాదాద్రిలో నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పూజలు



యాదాద్రి కొండపై నల్లగొండ బీర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని నల్లగొండ బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి శనివారం రాత్రి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభు, ప్రతిష్ఠా అలంకారమూర్తులతో పాటు ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే స్వామి వారిని దర్శించుకున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట నలగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఉన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Services

- లీగల్ & డిటెక్టివ్ (ప్రై): సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డివోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసులు Fast సెటిల్‌మెంట్ మరియు వెరిఫికేషన్ కొరకు అడ్వకేట్ AS రెడ్డి: 9676094111. [H-804912]

OLD AGE HOME

- స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోంకేర్ సర్వీస్: 24 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి, ఇంటి, వంట పని చేయుటకు మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సెల్: 8186926067, 8977263124. [W-1220996]

Real Estate

PLOT FOR SALE

- 5th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్ర చందనం&40రకాల పండ్ల మొక్కలతో 10గుంటల ప్లాట్లు కలవు. గజం : 2199/- 9346363436 [G-3138]
- నల్గొండ హైవే ఏపి ఎస్పీ బెటాలియన్ ఎదురుగా శివసాయి టౌన్‌షిప్ ఫేజ్ -II లో 200 గజాల ప్లాటు అమ్మకానికి కలదు. ఫోన్: 9985451781 [H-781815]
- హైదరాబాద్ @ రామోజీ ఫిల్మ్ సిటీ ప్రక్కనే హైవే ఫేసింగ్‌కు & ఇళ్ల మధ్య HMDA వెంచర్‌లో వెంటనే ఇళ్లు కట్టుకునే ప్లాట్లు, బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 9866807146 [HA-2325]

VILLAS FOR SALE

- Ready to Occupy Duplex Luxury 3 BHK - 2340 sft Villas in the Best Gated Community at Miryalaguda. Next to new D.Mart, Club House Swimming Pool Fully Operational Must See Call: 08069045560 [H-804910]

Wanted

- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18K. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]
- బికాం డిగ్రీ అకౌంటెంట్స్, టాలీ ఈ ఆర్ పి 9, MS ఆఫీస్ Fresher/Exp కలిగినవారు 3 సం॥లు కాంట్రాక్ట్ కొరకు మరియు ఆఫ్రికా దేశంలో పని చేయుటకు కావలెను. 9666653527 [H-787739]
- Req. ITI Fitters/ Dip. Mech/ECE candidates for Electronic Industry, Hardware Park, Hyderabad. Ph:9625064269/ 8341181182. [HA-31816]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799701]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185002]

ప్రకటన కొరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
భువనగిరి : 9010073592
9010178203
9010046033

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంకి అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పదో తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న విద్యార్థులు

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో శనివారం పదో తరగతి విద్యార్థులు ఘర్షణ పడ్డారు. గణితం పరీక్ష అనంతరం విద్యార్థులు ఇంటికి వెళ్లే తరుణంలో ఆటో ఎక్కే విషయంలో గొడవ జరిగింది. విద్యార్థులు స్థానిక ఎక్స్ రోడ్డు వద్ద రెండు వర్గాలుగా విడిపోయి తన్నులాటకు దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. స్థానికులు విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను చెదరగొట్టారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



భద్రయ్య(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతిచెందాడు. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో వి.భద్రయ్య(56) 26 ఏళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భద్రయ్య సమీప బంధువుల వివాహం శుక్రవారం విజయవాడలో ఉండటంతో ఆర్టీసీ బస్సును బుక్ చేశారు. వేడుక పూర్తయిన తర్వాత ఆ బస్సుకు భద్రయ్య డ్రైవర్‌గా వెళ్లి శనివారం తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో కృష్ణాజిల్లా చిల్లకల్లు వద్దకు చేరుకోగానే ఛాతిలో నొప్పి వస్తుందని బస్సును పక్కకు నిలిపాడు. జగ్గయ్యపేటలోని ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య నలుగురు కూతుళ్లు ఉన్నారు. డిపో మేనేజర్ కోదాడ డిపో నుంచి డ్రైవర్‌ను పంపించి బస్సును తెప్పించారు. భద్రయ్య మృతదేహాన్ని సందర్శించి తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు.ఆయన వెంట డిపో సీఐ భారతి ఉన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి

చండూరు : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడిన గీత కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాలకూరి మారయ్య (64) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగా మారయ్య కల్లు తీసేందుకు ఈ నెల 20న గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ : వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వలిగొండ మండలం నాగారం సమీపంలోని వ్యవసాయ బావి పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అక్కడ భువనగిరి మండలం సురేపెల్లికి చెందిన వంగూరి కృష్ణ, నందనానికి చెందిన పైళ్ల అశోక్ రెడ్డి, తుమ్మలగూడేనికి చెందిన రాచకొండ పాండు, రవి, సంజీవ గోస్, వలిగొండకు చెందిన మునుకుంట్ల మల్లికార్జున్ పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, రూ.5,200, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు.



నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం

28 మార్చి 2024 గురువారం - మట్టపల్లి గ్రామం, మఠంపల్లి మండలం, హుజూర్‌నగర్ నియోజకవర్గం

మార్చి 28వ తేది గురువారం మట్టపల్లి గ్రామములో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నాయకుల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించబడుచున్నది. ఈ సమావేశమునకు ప్రస్తుత మరియు మాజీ మంత్రులు / జిల్లా పరిషత్ చైర్ పర్సన్లు / పార్లమెంటు సభ్యులు / శాసనమండలి సభ్యులు / శాసన సభ్యులు / గత ఎన్నికల్లో పోటీ చేసిన శాసన సభ అభ్యర్థులు / డి.సి.సి.బి.చైర్మన్‌లు / డి.సి.ఎం.ఎస్ చైర్మన్‌లను సాధరంగా ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించవలసిందిగా కోరుచున్నాను.

నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలోని (7) శాసన సభ నియోజకవర్గాలలో క్రింద పేర్కొనబడిన పార్టీ పదవులలో ఉన్నవారిని ఆహ్వానిస్తున్నాను.

1) ప్రస్తుత మరియు మాజీ వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు / డైరెక్టర్లు
2) ఎ.ఐ.సి.సి. మెంబర్లు / పి.సి.సి.మెంబర్లు
3) డి.సి.సి. అధ్యక్షులు / కార్యనిర్వాహక అధ్యక్షులు / మెంబర్లు
4) జిల్లా/బ్లాక్/ మండల / గ్రామ/ టౌన్ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ అన్ని అనుబంధ సంస్థల అధ్యక్షులు, కార్యదర్శులు

(అనగా మహిళా, యువజన, విద్యార్థి, మైనారిటీ విభాగాలు, బి.సి., యస్.సి., యస్.టి., కార్మిక, సేవాదళ్, కిసాన్ సెల్ ల వంటి అన్ని విభాగాల)

ఈ క్రింద పేర్కొనబడిన ప్రస్తుత ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నాను.

1) ప్రస్తుత మరియు మాజీ జెడ్.పి.టి.సి.లు / ఎం.పి.పి.లు / పి.ఎ.సి.ఎస్.చైర్మన్‌లు
2) మున్సిపల్ చైర్మన్‌లు / కౌన్సిలర్‌లు
3) ఎం.పి.టి.సి.లు
4) పి.ఎ.సి.ఎస్.డైరెక్టర్‌లు
5) తాజా మాజీ సర్పంచులు (2019-2024)

కార్యక్రమం :

- ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు - మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో దర్శనము. (మధ్యాహ్నం 1.00 గంటలకు దేవాలయం మూసివేయబడుతుంది)
- మధ్యాహ్నం 1.00 గంటల నుండి 2.00 గంటల వరకు - భోజన విరామం - వైశ్య సత్రంలో అందరికి భోజనాల కార్యక్రమం.
- మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు, టి.టి.డి. కళ్యాణ మండపంలో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం.
- సాయంత్రం 5.00 గంటలకు కార్యక్రమం ముగింపు.

ఇట్లు
ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
ఎమ్మెల్యే హుజూర్‌నగర్
రాష్ట్ర నీటిపారుదల & పౌర సరఫరాల శాఖా మంత్రి
నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జీ